క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కందుకూరు రూరల్: మండలంలోని కోవూరులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌శేఖర్ తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు. అలాగే సాయంత్రం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుక-నూతన పింఛన్లు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

నేడు మండల సమావేశం

ఉలవపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండల పరిధిలోని అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

55 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం ముప్పాళపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు

కనిగిరి రూరల్: త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వాయిద్య కళాకారుల సంఘ నాయకులు, పాలూరి నారాయణబోదనమునీల ఆధ్వర్యంలో త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు జరిగాయి. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్యాగరాజు స్వామి చిత్ర పటానికి పట్టణ పుర వీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ర్యాలీలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వాసవీ సత్ర సముదాయ రాష్ట్ర అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సేవాసంఘ రాష్ట్ర నాయకులు చింతలపూడి వెంకటేశ్వర్లు, పాలూరి నారాయణ, హస్తకళ డైరెక్టర్ చెరుకూరి జయలక్ష్మి, చిన కాశయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.22 లక్షలు



మహా ప్రాకారం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ. 1,22,596 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.54,270, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.21,630, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.14,580, ఆలయ మహా ప్రాకారం నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.21,600, పుష్పాలంకరణ కోసం దాతల విరాళం రూ.10,516 లు వచ్చినట్లు చెప్పారు.

పట్టాభి సీతారామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ప్రముఖులు

సీఎస్‌పురం: మండలంలోని బోయమడుగుల పట్టాభి సీతారామ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో స్వామి శిలలను ప్రతిష్ఠించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అయోధ్య రామాలయం నుంచి స్వామి పాదుకలను బోయమడుగుల పట్టాభి సీతారామ స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృత అభిషేకాలు, స్వామి ఉత్సవ మూర్తులు, స్వామి వారి పాదుకలకు అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నారాయణ స్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర నేతలు వేడుకల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



లింగసముద్రంలో ప్రత్యేక అలంకరణలో స్వామి



గుడ్లూరులో ప్రత్యేక అలంకరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి



పామూరులో మదన వేణుగోపాలస్వామి పూజలు



సీఎస్‌పురంలో శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామి, నారాయణస్వామిలకు ఉత్సవం



కందుకూరు ముదిరాజ్‌పాలెంలో స్వామి ఊరేగింపు



కనిగిరిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పీసీపల్లి కోదండరామస్వామి దేవస్థానంలో పాల్గొన్న భక్తులు



కందుకూరు జనార్దనస్వామిని దర్శించుకుంటున్న ఆలయ చైర్మన్ బ్రహ్మానందం

పామూరు: ముక్కోటి ఏకాదశి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారా దర్శనార్థం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, అయ్యప్ప, సాయిబాబా, కన్యకాపరమేశ్వరీదేవి, మహాలక్ష్మమ్మ దేవాస్థానాల్లో అర్చకులు అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు.

సీఎస్‌పురం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో, అయ్యలూరివారిపల్లి సమీపంలోని తిరుమలనాథస్వామి ఆలయం, డీజీపేట రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామి, నారాయణస్వామి వారలను పల్లకీపై ఉంచి గుడి చుట్టూ ఉత్సవం నిర్వహించారు. తిరుమలనాథ స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి మూల విరాట్‌ను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. డీజీపేటలో సతీరామచంద్ర స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణ రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించారు.

పీసీపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. పెదయిర్లపాడులో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలోని వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

కందుకూరు: పట్టణంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో స్వామి ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టణంలోని ముదిరాజ్‌పాలెం రామాలయంలో ఏకాదశి వేడుకలను కన్నుల పండుగగా సాగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామి గరుడ వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. స్వామిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొంగల నాగరాజు, పంది పోతురాజు, రుద్రబోయిన రాజు, మోసంగి కోటేశ్వరరావు, నరశింగరావు, నాగమల్లి, ప్రభాకర్, నాంచారయ్య, హరి, చింతరబోయిన మాల్యాద్రి, రాజా పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జనార్దనస్వామిని ఆలయ పూజారులు ప్రత్యేకంగా అలంకరించి ఉత్తర ద్వారంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఈఓ బైరాగి చౌదరి భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు.

గుడ్లూరు: ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మిట్టపాలెం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు శేషాచార్యులు, భరద్వాజ్‌లు స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అలాగే నీలకంఠేశ్వర, సీతారామ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ఉలవపాడు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ద్వారదర్శనంలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి జానకీదేవి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

లింగసముద్రం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని చినపవనిలో లక్ష్మి పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కనిగిరి రూరల్: ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం కనిగిరిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బొడ్డు చావిడి వద్ద, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సాయిబాబా గుడిలో ఉత్తర ద్వార దర్శనంలో స్వామి దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు ఎంతో నియమనిష్ఠలతో స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వివిధ ఆలయాల వద్ద ఉత్తర ద్వార దర్శనంలో కొలువు తీరిన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నాయకులు బి.రమేష్, బి.అఖిల్, అయితా సుబ్బయ్య, గొంట్లా మల్లికార్జునరావు, నార్లపాటి మల్లికార్జున, అద్దంకి సుబ్రహ్మణ్యం, కొలిపర్తి వెంకట స్వామి పాల్గొన్నారు.

సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారు వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గీతామందిరం, చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానం, కోదండరామస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెట్టుమహాలక్ష్మమ్మ ఆలయంలో రూపాయి కాయిన్స్‌తో అమ్మవారికి తులాభారం నిర్వహించారు.

టంగుటూరు: వల్లూరులోని వల్లూరమ్మ ఆలయంలో, జమ్ములపాలెం రాములవారి ఆలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, పొందూరు, టంగుటూరులోని బ్రాహ్మణ బజారులోని సీతారామచంద్ర స్వామి, గంగమ్మతల్లి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాలల్లో భక్తులు పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసరావు, ఈఓ సుబ్బారావు పాల్గొన్నారు.



పొందూరులో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి



ఉలవపాడులో వేణుగోపాలుని ద్వారదర్శనం

భూముల వివరాల పరిశీలన

సీఎస్‌పురం: బీకేవీ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు భూముల వివరాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం లక్ష్మీ నరసింహం సోమవారం పరిశీలించారు. బీకేవీ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో మండలంలోని ఏ కొత్తపల్లి, రేగులచెలక, గుంతచెన్నంపల్లి, ఉప్పలపాడు, సీఎస్‌పురం, మునునూరు, పెదగోగులపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు భూములు కోల్పోతున్న విషయం విదితమే. సోమవారం సీఎస్‌పురం వచ్చిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనరసింహం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ భూముల వివరాలను పరిశీలించారు. ఆయా రెవెన్యూ గ్రామాల వీఆర్వోల ద్వారా గ్రామాల పరిధిలో కోల్పోతున్న భూములను సరి చూసుకున్నారు. మండలంలో 141.45 ఎకరాలు అసైన్‌మెంట్ భూములు, 131.15 ఎకరాలు సెటిల్మెంట్ భూములు, 74.95 ఎకరాలు వాగులు, చెరువుల భూములు, 20.68 ఎకరాలు అటవీ భూములు కోల్పోతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎ బాలకిషోర్, డిప్యూటీ తహసీల్దార్ మాధవరావు, డేవిడ్, ఆర్ఐ మల్లికార్జున, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



భూముల వివరాలు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన విధంగా పింఛను సొమ్ము పెంచడంతో గ్రామాల్లోని అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోందని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో కొత్తగా మంజూరైన 26 పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. పొన్నలూరు మండలంలో కొత్తగా 174 పింఛన్లు మంజూరయ్యాయని, రెండు రోజుల నుంచి పండుగ వాతావరణంలో సచివాయ సిబ్బంది, వలంటీర్లు పొద్దుపొడవక ముందే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కంచర్ల రవణయ్య, కార్యదర్శి హరినారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పొన్నలూరులో పింఛను అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

వావిలేటిపాడులో నూతనంగా 7 పింఛన్లు

సింగరాయకొండ: జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడులో ఏడుగురికి నూతనంగా మంజూరైన ఫించన్లను సర్పంచ్ పాలేటి వెంకటరత్నం సోమవారం స్థానిక సచివాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన మదనమనోహర్, పాలేటి రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

– ఒంగోలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ

సింగరాయకొండ: జరుగుమల్లి మండలంలోని పైడిపాడు ఆర్బీకేలో సోమవారం ఒంగోలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో రబీ పంటల సాగులో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. శనగలో ఎండు తెగులు నివారణకు విరిడీతో పశువుల ఎరువు, వేపపిండి కలిపి పొలంలో వెదజల్లాలని సూచించారు. సింగరాయకొండ డివిజన్ వ్యవసాయ సహాయకురాలు నిర్మలకుమారి మాట్లాడుతూ.. వరిలో పొట్ట దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఓ డి.యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ఎన్.భాస్కర్, అధికారులు శైలజ, వెంకట శేషమ్మ పాల్గొన్నారు.



పైడిపాడులో పొగాకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

12న సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీవుల్లా తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గంగభవాని మృతికి సంతాపం

కనిగిరి రూరల్: పర్చూరు జెడ్పీటీసీ కొల్ల గంగాభవాని మృతికి జెడ్పీటీసీ సంఘ ఉపాధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

బెంగళూరు హైవే పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్

వెలిగండ్ల: అమరావతి- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను కనిగిరి ఆర్‌డీఓ కె. సందీప్‌కుమార్ సోమవారం పరిశీలించారు. తొలుత వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఎక్స్‌ప్రెస్ హైవే రూటుకు సంబంధించిన మ్యాప్, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఎక్స్‌ప్రెస్ హైవే రూటులో ఉన్న భూముల వివరాలను పరిశీలించారు. అనంతరం నాగిరెడ్డిపల్లి గ్రామం వెలుపల ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవే వెళ్లే రూటును పరిశీలించారు. తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఎస్. మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో 6 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఇంటిపన్నును ఆధార్ నంబర్‌కు మార్పు చేయాలని, పింఛన్ మంజూరు చేయాలని, ఇంటి పన్ను తగ్గించాలని, ఇంటి ముందు చెట్టు తొలగించాలని అర్జీలు వచ్చాయన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు ధీరజ్

పామూరు: రోడ్డుప్రమాదంలో గాయాలపాలైన చిరు వ్యాపారి వైద్యశాలలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. వివరాలు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్ తన తండ్రి నర్సింగ్, సోదరునితో కలిసి రెండేళ్ల క్రితం పామూరు వచ్చి తోపుడుబండిపై పాప్‌కార్న్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ ఆదివారం మండలంలోని తిరగలదిన్నెలో రాత్రి 8 గంటల సమయంలో బండి తోసుకుంటూ 565 జాతీయ రహదారిపై పామూరుకు తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో ధీరజ్‌ను వెనుక నుంచి మోటార్‌సైక్లిస్టు బలంగా ఢీకొట్టాడు. ఘటనలో ధీరజ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. అనంతరం డాక్టర్ల సలహామేరకు మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి నర్సింగ్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై కే.సురేష్‌యాదవ్ తెలిపారు. బతుకుదెరువుకోసం వచ్చి ఇలా కుమారుడు మృత్యువాత పడటంతో మృతుని తండ్రి, సోదరుడు శోకసంద్రంలో మునిగారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పొదిలి: మర్రిపూడి మండలంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పొదిలి సీడీపీఓ సుధమారుతి తెలిపారు. అయ్యపురాజుపాలెం(ఎస్టీ), ధర్మవరం(బీసీ-బి)లో ఆయా పోస్టులకు అర్హత కలిగిన వారు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు పొదిలి సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని స్పష్టం చేశారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



పింఛన్ నగదును అందచేస్తున్న చైర్మన్ గఫార్, ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు



సీఎస్‌పురంలో పింఛన్ నగదు నగదు అందజేస్తున్న సుబ్బరామయ్య, గౌస్

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పింఛన్ కానుక పెంచి పేదవర్గాల కళ్లల్లో కొత్త కాంతులు నింపారని మున్సిపల్ చైర్మన్ ఎస్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 8వ సచివాలయంలోని 13,19 వార్డుల్లో లబ్ధిదారులకు నూతన పెన్షన్‌లు, పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును సోమవారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు సయ్యద్ రిజ్వానఖాలక్, కరీమున్ ఖాశింసాల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అడ్మిన్ శైలజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని అవ్వ తాతలు, అక్క, చెల్లమ్మలు అందరూ ఆశీర్వదించాలన్నారు. పట్టణంలోని 4,299 మందికి రూ 1.19 కోట్లు పింఛన్ నగదును అందచేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో పచ్చ చొక్కాల వారికే పింఛన్‌లు వచ్చేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్‌లు మంజూరు చేసినట్లు చెప్పారు. వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వా తాతలకు అండగా ఉంటూ ఆదుకుంటున్నారని సింగిల్‌విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, నవోదయ హ్యూమన్‌రైట్ సొసైటీ అధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు సోమవారం నగదు పంపిణీ చేశారు. సర్పంచ్ యనమల పెదసుబ్బయ్య పాల్గొన్నారు. డీజీపేటలో మంజూరైన పింఛన్లను సర్పంచ్ ఊటుకూరి సుదర్శనం, ఎంపీటీసీ మితికేల ప్రభావతిలు అందజేశారు.

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందచేస్తున్నట్లు ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. మండలంలోని ఏరువారిపల్లి సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ దమ్ము వెంకటయ్య అధ్యక్షతన జరిగింది.

పీసీపల్లి: మండలంలోని గుంటుపల్లిలో పెంచిన్ల పెన్షన్లను సర్పంచ్ శేషం పేరమ్మ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

సీఎస్‌పురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఏ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ పాతర లలితమ్మ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సి. నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుమారి, ఎఫ్ఎస్ఓ అలీం, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పాళ్ల వసంతరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు